# నేడే సీఎం ప్రమాణ స్వీకారం

- ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాట్లు ముమ్మరం
- పర్యవేక్షించిన సీఎస్, డీజీపీ, కలెక్టర్
- అధికారులకు పలు సూచనలు
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు



ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎస్ శాంతకుమారి, డీజీపీ రవిగుప్తా, తదితరులు

సిటీబ్యూరో, (నమస్తే తెలంగాణ) / సుల్తాన్‌బజార్, డిసెంబర్ 6: తెలంగాణ రాష్ట్రానికి మూడవ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గురువారం ఎల్‌బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉన్నతా ధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. బుధవారం ఎల్‌బీ స్టేడియంలో సీఎస్ శాంత కుమారి, డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్, జలమండలి ఎండీ దానకిశోర్, నగర పోలీస్ కమిషనర్ సందీప్‌శాండిల్యా, డీఎంఈ రమేశ్‌రెడ్డితో పాటు ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఎటువంటి ఆటంకాలు రాకుండా చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్, మువజన నాయకులు అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు ఇతర నాయకులు ఎల్‌బీ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రె, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, యాదగిరి రావు, ఉపేందర్ రెడ్డి, ఎంటమాలజీ చీఫ్ డాక్టర్ రాంబాబు, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, సీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

### ఎల్బీ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు


ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎల్బీ స్టేడియం పరిసరాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా పంజాగుట్ట, వీవీ విగ్రహం, మోనప్ప జంక్షన్, నిరంకారి, సైఫాబాద్, లక్డీకపూల్, రవీంద్రభారతి, ట్రాఫిక్ కంట్రోల్ రూం, బషీర్‌బాగ్, అబిడ్స్ సర్కిల్, నాంపల్లి, హిమాయత్‌నగర్, ఎంజే మార్కెట్, హైదర్‌గూడ జంక్షన్లలో రద్దీ ఉంటుందని, ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని వాహనదారులకు సూచించారు.



బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును బుధవారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

## భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్



అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్

కవాడిగూడ, డిసెంబర్ 6: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని అన్నారు.

## *టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో..*



నాంపల్లిలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి టీఎన్జీవో అధ్యక్షుడు ఎస్ఎం హుస్సేనీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం సభ్యులు పర్వతాలు, చంద్రశేఖర్, జిల్లా శాఖ కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, కోశాధికారి బాలరాజ్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, సభ్యులు ఖాలేద్ అహ్మద్, బి.శంకర్, ముఖీం ఖురేషి, శ్రీధర్ నాయుడు, ఏపీఆర్‌వో మహ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

*- సుల్తాన్‌బజార్, డిసెంబర్ 6*

## *దేవాదాయ శాఖ కార్యాలయంలో..*



దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.జ్యోతి, ఎంఎండీ క్రిష్ణవేణి, యాదాద్రి ఆలయ ఈఓ గీతారెడ్డి, కాందూరి కృష్ణమాచారి, టీఎన్‌జీఓ దేవాదాయ శాఖ అధ్యక్షుడు బాబు శంకర్, పంకజ్ కుమార్, సందీప్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వావ్.. వారాంతపు సంత

- మార్కెట్ల కంటే గల్లీ సంతలోనే తాజా కూరగాయలు
- ఆన్‌లైన్‌లో నాణ్యత తక్కువ, ధరలు ఎక్కువ
- లోకల్ సర్కిల్ సర్వేలో 66శాతం మంది వినియోగదారుల అభిప్రాయం



సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తాజా కూరగాయల కొనుగోలులో వారాంతపు సంతలకు ఆదరణ లభిస్తున్నది. మార్కెట్లు, ఆన్‌లైన్, కిరాణా దుకాణాల్లో కాదని ఎక్కువ మంది వినియోగదారులు వారాంతపు సంతకు క్రేజీ కనబర్చుతున్నట్లు లోకల్ సర్కిల్ సర్వేలో తేలింది. కూరగాయలు, పండ్లు ఎక్కడ కొనుగోలు చేస్తున్నారన్న అంశంపై దేశవ్యాప్తంగా 297 జిల్లాల్లో 24వేల మంది వినియోగదారుల నుంచి సర్వే జరిపారు. 61శాతం మంది పురుషులు, 39శాతం మంది మహిళల నుంచి వివరాలను సేకరించారు. ఇందులో 66 శాతం మంది వారాంతపు మార్కెట్లకు వచ్చి తాజా పండ్లు, కూరగాయలను కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. 7శాతం మంది మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నామని, 21శాతం మార్కెట్లలో, 3శాతం తోపుడు బండ్లు, 5 శాతం రిటైల్ దుకాణాల ద్వారా కూరగాయలు కొనుగోలు చేస్తున్నట్లు సర్వేలో తేలింది. ఆన్‌లైన్ కొనుగోలులో ఉత్పత్తి తక్కువ నాణ్యత, అధిక ధరలు వంటి కారణాలుగా వినియోగదారులు పేర్కొన్నారు. కార్మికులు, దినసరి కూలీలు, ప్రైవేట్ ఉద్యోగులు, భవన నిర్మాణరంగ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు అవసరమైన కూరగాయలు, పండ్లు, పలు రకాల ఆకుకూరలు, ఇంట్లోకి కావాల్సిన నిత్యావసర వస్తువులను వారాంతపు సంతలో కొనుగోలు చేయడానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వినియోగదారుల నుంచి డిమాండ్ ఉండడంతో నగరంలో చాలా చోట్ల ప్రాంతాల వారీగా వారంలో ఏడు రోజులు సంతలు నడుస్తున్నాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు సంత సాగుతుంది. ఇంటి దగ్గర సంతలోనే అన్నీ దొరకడంతో వారాంతపు సంతలను ఇష్టపడుతున్నట్లు తెలిపారు. సమయం, డబ్బు కూడా ఆదా అవుతుందని పేర్కొన్నారు.

## అంబేద్కర్‌ను తాకే అర్హత రాజాసింగ్‌కు లేదు

### ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అడ్డుకున్న దళిత సంఘాల నేతలు

కవాడిగూడ, డిసెంబర్ 6 : లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట బీజేపీ, దళిత సంఘాల మధ్య జరిగిన గొడవ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించడానికి వచ్చిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అంబేద్కర్‌ను తాకే అర్హత నీకు లేదంటూ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ, తోపులాట, వాగ్వాదం జరిగింది. కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువురిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవించని రాజాసింగ్ లాంటి నాయకులకు అంబేద్కర్‌కు నివాళులర్పించే నైతిక హక్కు లేదని ఆరోపించారు. దళితుల ఆహార అలవాట్లు, జీవన శైలిపై విషం చిమ్మే వ్యక్తి రాజాసింగ్ అని ఆయన మండిపడ్డారు. అంబేద్కర్ సిద్ధాంతాలను గౌరవించలేని, దళిత వ్యతిరేకి రాజాసింగ్‌కు అంబేద్కర్ విగ్రహం తాకే హక్కు లేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలను రద్దు చేయాలని నినదించే బీజేపీ నేతలు ఇక్కడికి రావద్దని అన్నారు. రాజాసింగ్ అనే వ్యక్తి ఎవరని, ఆయనది ఏ రాష్ట్రమని ప్రశ్నించారు. భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యహరించేవారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. రాష్ట్రంలో హిందూ ముస్లింల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని, ఇది సహించేది లేదన్నారు. దళితులను అవమానిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## 31వ జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు..

# సిస్టర్ నివేదిత స్కూల్ విద్యార్థి ఎంపిక



సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని సిస్టర్ నివేదిత హైస్కూల్‌కు చెందిన శివమ్ బనర్జీ అనే విద్యార్థి 31వ జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బాలల సైన్స్ కాంగ్రెస్‌లో శివమ్ బనర్జీతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విజయ నగర్‌కాలనీ విద్యార్థి వియూరి లిఖిత, భారతీయ విద్యా భవన్ విద్యార్థిని రాగవి, జవహర్ వీఎన్ ఇంగ్లిష్ హైస్కూల్ విద్యార్థి జి.హృశిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిస్టర్ నివేదిత స్కూల్‌కు చెందిన విద్యార్థి శివమ్ ఫాస్టర్ హెల్త్ న్యూట్రిషన్ వెల్‌బీయింగ్ ఉప అంశంలో తన ప్రాజెక్టు సీరిస్‌ను ప్రదర్శించడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శివమ్‌ను జిల్లా విద్యాధికారిణి ఆర్.రోహిణి, జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ తదితరులు అభినందించారు.